ఆగని ఆర్థిక మోసాలు

- జోగులాంబ గద్వాల జిల్లా అయిజలో అలజడి
- గత ఏడాది ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ. 50 కోట్లు కొల్లగొట్టిన సంస్థ 6
- తాజాగా రూ. కోటి అప్పు చేసి ఐపీ పెట్టిన వ్యాపారి

రూ.30 లక్షలు.. స్వాహా

- బ్యాంకుల్లో రుణ వాయిదాలు చెల్లించాలని బుక్ కీపర్‌కు ఇచ్చిన మహిళా సంఘాల సభ్యులు
- గార్లపాడ్ ఏడీబీ(ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు) హోల్డర్‌కు ఇచ్చానన్న బుక్ కీపర్
- ఏళ్ల తరబడి జమకాని డబ్బులు
- కోయిలకొండ మండలం రాంపూర్‌లో వెలుగులోకి..
- విచారణలో ఒక్కొటిగా బయటికి వస్తున్న అవినీతి
- తమ డబ్బులు ఇప్పించాలని మహిళల వేడుకోలు



విచారణ సందర్భంగా రాంపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గుమి గూడిన గ్రామస్థులు

కోయిలకొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు సంబంధించి వాయిదాలు చెల్లించాలని బుక్ కీపర్లను నమ్మి డబ్బులు ఇస్తే వారు వాటిని జమ చేయకుండా కాజేసిన సంఘటన కోయిలకొండ మండలం రాంపూర్‌లో వెలుగు చూసింది. కూలీనాలి చేసి, డబ్బులు వాయిదాలు కట్టేందుకు మధ్యవర్తులను నమ్మి చేతిలో పెడితే తమను నట్టేట ముంచారని, తమ డబ్బులు తమకు ఇప్పించాలని బాధిత మహిళలు వాపోతున్నారు. రాంపూర్‌లో 39 మహిళా సంఘాలు ఉన్నాయి. గ్రామ ఐక్య సంఘం రాంపూర్-1లో 21, గ్రామ ఐక్య సంఘం రాంపూర్ 2లో 18 సంఘాలు ఉన్నాయి. రాంపూర్ 2 గ్రామ ఐక్య సంఘంలోని గోల్డెన్ సంఘం రూ.7 లక్షలు, శ్రీవిష్ణు సంఘం రూ.6 లక్షలు, వెన్నెల సంఘం రూ.10 లక్షలు, తాజ్‌మహల్ సంఘం రూ.10 లక్షలు, సూర్యలక్ష్మి సంఘం రూ.10 లక్షలు, ఆదర్శ సంఘం రూ.10 లక్షలు ఏడీబీ మహబూబ్‌నగర్ బ్రాంచిలో రుణాలు తీసుకొన్నారు. గోల్డెన్ సంఘం 2021 జనవరి, శ్రీవిష్ణు సంఘం 2021 మార్చి, వెన్నెల సంఘం 2022 సెప్టెంబరు, తాజ్‌మహల్ సంఘం 2023 జూన్, సూర్యలక్ష్మి సంఘం 2023 జూన్, ఆదర్శ సంఘం 2023 ఫిబ్రవరిలో రుణాలు తీసుకున్నాయి. అప్పటి నుంచి తీసుకున్న రుణాలకు సంబంధించి ప్రతీ నెల వాయిదాలు చెల్లించేందుకు డబ్బులు బుక్ కీపర్‌కు ఇచ్చామని, సంఘాల మహిళలు చెబుతున్నారు. కానీ 6 సంఘాల డబ్బులు దాదాపు రూ.30 లక్షలు జమ చేయకుండా కాజేశారని వాపోతున్నారు. మహిళా సంఘాల వద్ద తీసుకున్న డబ్బులు ఎస్‌బీఐకి అనుబంధమైన గార్లపాడ్ ఏడీబీ(ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు) హోల్డర్ భాగ్యశ్రీకి అందించామని, ఆమె రశీదు ఇవ్వలేదని ఐకేపీ బుక్ కీపర్ వరలక్ష్మి ఆరోపిస్తున్నారు. భాగ్యశ్రీ మాత్రం తనకు డబ్బులు ఇవ్వలేదని చెబుతున్నారని సంఘాల మహిళలు అంటున్నారు. ఈ విషయమై 6 మహిళా సంఘాల సభ్యులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.



సమావేశాలు నిర్వహించడం లేదు

మహిళా సంఘాల రుణాలు, ఇతర విషయాలపై సమావేశాలు నిర్వహించాల్సి ఉండగా, 3 సంవత్సరాలుగా నిర్వహించడం లేదు. ఇచ్చిన డబ్బులు ఎక్కడ పోయాయన్న విషయం తెలుస్తలేదు.

\- జయమ్మ, గ్రామ ఐక్య సంఘం అధ్యక్షురాలు, రాంపూర్ 2

అధికారుల విచారణలో..

కలెక్టర్ ఆదేశాలతో మంగళవారం రాంపూర్ గ్రామ పంచాయతీలో డీపీఎం సలోమి, ఏపీఎం మల్లేశ్ నిర్వహించిన విచారణలో విస్తుపోయే నిజాలు బయటకు వచ్చాయి. గ్రామ ఐక్య సంఘం రాంపూర్ 2కు సంబంధించి 6 మహిళా సంఘాల బ్యాంకు పాసుపుస్తకాలు, ఇతర రికార్డులు మహిళా సంఘాల వద్ద కాకుండా బుక్ కీపర్లు తమ వద్దే ఉంచుకున్నారని మహిళలు తెలిపారు. అందుకే తాము మోసపోయామని అంటున్నారు. తమకు సంబంధించిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం డబ్బులు బ్యాంకు నుంచి కట్ కావడం, తాము చెల్లించిన డబ్బులు బ్యాంకులో జమ కాకపోవడంతో ఏడీబీ బ్యాంకు ఫీల్డ్ అధికారి వద్దకు వెళ్లి అడుడగా తమ పట్ల దురుసుగా ప్రవర్తించారని మహిళలు తెలిపారు. కాగితాలు చించేశారని చెప్పారు. డబ్బులు జమ కాలేదన్న విషయం బయటకు పొక్కడంతో సంఘాల పాసు పుస్తకాలు తమకు ఇచ్చారన్నారు. రెండు మూడు రోజులుగా రెండు మూడు సంఘాల బ్యాంకు ఖాతాల్లో రూ.5 వేల నుంచి రూ.10 వేలు జమ చేస్తున్నారని చెప్పారు. 3 సంవత్సరాలుగా ఎలాంటి మహిళా సంఘాల సమావేశాలు నిర్వహించడం లేదని మహిళలు చెబుతున్నారు. రేపు కూడా విచారణ ఉంటుందని, విచారణ పూర్తయ్యాక కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని చెప్పారు.

డబ్బులు ఇచ్చినా జమ కాలేదు



వెన్నెల మహిళా సంఘం నుంచి మేము రూ.10 లక్షలు బ్యాంకు నుంచి రుణం తీసుకున్నాం. సంఘంలోని మహిళలందరం కలిసి వాయిదా డబ్బులు బ్యాంకులో కట్టాలని బుక్ కీపర్‌కు ప్రతీ నెల ఇచ్చాం. బ్యాంకుకు వెళ్లి చూసుకుంటే డబ్బులు జమ కాలేదు. మేము కట్టిన 8.70 లక్షలు ఎక్కడ పోయినవో తెల్వదు.

\- భీమమ్మ, వెన్నెల సంఘం అధ్యక్షురాలు, రాంపూర్

బ్యాంకు పాసు పుస్తకాలు మా వద్ద లేవు



రుణం తీసుకున్నప్పటి నుంచి సంఘాల పాసు పుస్తకాలు మా వద్ద లేవు. దాంతో మేము కట్టిన డబ్బులు చూసుకొనే పరిస్థితి లేదు. చదువు రాదని, మాకు ఏమీ తెల్వదని, మేము ఇచ్చిన రూ.4 లక్షలు బ్యాంకులో జమ చేయలేదు. పుస్తకాలు మాకు నిన్న మొన్న ఇచ్చారు.

\- నాగమ్మ, గోల్డెన్ సంఘం, రాంపూర్

భూ భారతి పైలట్ ప్రాజెక్టుగా సాలర్‌నగర్



సాలర్‌నగర్ గ్రామం

- గ్రామంలో ఇప్పటికే పూర్తయిన నక్ష గుర్తింపు
- 122 సర్వే నంబర్లలో 414.14 ఎకరాల భూమి ఉన్నట్లు గుర్తింపు
- ఏయే సర్వే నంబర్లలో ఎన్ని భూములు ఉన్నాయో డ్రోన్లు వచ్చాక చేపట్టనున్న సర్వే

గండీడ్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న భూ భారతి పథకంలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సాలర్‌నగర్ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసింది. గ్రామంలో 122 సర్వే నంబర్లకు గాను 414.14 ఎకరాల భూమి ఉంది. ఇప్పటికే నక్షను గుర్తించగా ఏయే సర్వే నంబర్లలో ఎన్ని భూములు ఉన్నాయో గుర్తించాల్సి ఉంది. డ్రోన్లు వచ్చాక వాటిని గుర్తిస్తామని అధికారులు చెబుతున్నారు. పాస్‌బుక్‌లో తక్కువ భూమి ఉండి, పొజిషన్‌లో ఎక్కువ ఉండటం, పొజిషన్‌లో ఎక్కువ భూమి ఉండి, పాస్‌బుక్‌లో తక్కువ ఉండటం వంటి వివాదాలు, పార్ట్ బీ, మోఖ డిస్ప్యూట్ సమస్యలు భూభారతి పైలట్ ప్రాజెక్ట్‌తో సద్దుమణిగే అవకాశం ఉంది.

ప్రజల సమక్షంలో..

గ్రామ పరిధిలో ఉన్న గ్రామ కంఠం స్థలాలు, వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ప్రాజెక్టులు, కుంటలు, కాలువలు, అటవీ భూములు తదితరాలను గుర్తించి, హద్దులను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ప్రజా సమక్షంలో సర్వే నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సర్వే అండ్ ల్యాండ్ జాయింట్ డైరెక్టర్ ప్రసన్న లక్ష్మి ఆదేశాల మేరకు ఈ నెల 7వ తేదీ నుంచి సర్వే పనులు మొదలయ్యాయి. సర్వేలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా ల్యాండ్ అండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ కిషన్ రావు, డీటీ మాధవి, సర్వేయర్ నీలిమ, ఇతర అధికారులు ప్రజా సమక్ష్యంలో గ్రామ సభను నిర్వహించారు. ఈ ప్రాజెక్టు గురించి అవగహన కల్పించారు.

భూ నక్ష పరిశీలన..

ప్రాజెక్టు సర్వే ప్రారంభం చేసే కంటే ముందు గ్రామానికి చెందిన భూ నక్షాను పరిశీలించి గ్రామ పరిధి, హద్దులు ఎక్కడి వరకు ఉన్నాయాన్న అంశాలను గుర్తించారు. గ్రామ శివారు చుట్టూ బైస్‌పల్లి, జక్లపల్లి, పెద్దవార్వల్, సాలర్‌నగర్ చెరువు ప్రాజెక్టు, అటవీ భూములు ఉన్నట్లు నిర్ధారించారు. గ్రామానికి చెందిన నక్ష పరిపూర్ణంగా ఉండటంతో సంబంధిత అధికారులు క్షుణ్ణంగా గుర్తించగలిగారు.

ప్రారంభమైన సర్వే

అన్ని కార్యక్రమాలు పూర్తి అయిన వెంటనే గ్రామంలో సర్వేను ప్రారంభించారు. ఏడీ కిషన్ రావు, డీఐ మహమ్మద్ మూసా, మండలానికి చెందిన సర్వేయర్, మరో ఇద్దరు సర్వేయర్లు సర్వేను చేపట్టారు. గడిచిన పది రోజుల్లోనే డిజిటల్ సర్వే ద్వారా గ్రామ కంఠం భూములను గుర్తించినట్లు సర్వేయర్లు తెలిపారు. మిగితా అన్ని రకాల పొలాలు, భూములు, కుంటలు, అటవీ భూములు, చెరువులు, కాలువల సర్వే పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. కచ్చితమైన సర్వే నిర్వహించి, హద్దులు నిర్ణయించనుండటంతో భూసమస్యలు తలెత్తకుండా, వివాదాలు సద్దుమణగనున్నాయి.



సాలర్‌నగర్‌లో సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

లోపలి పేజీల్లో..



మామిడి ఒరుగు.. సంపాదన మెరుగు

- ఏపీ, కర్ణాటకల నుంచి కాయల దిగుమతి 7
- కోసి ఎండ బెట్టి, ఒరుగు చేసి ఎగుమతి
- రెండు నెలల పాటు ఉపాధి



2డే క్రికెట్ టోర్నీలో పాలమూరు గెలుపు

- జడ్చర్లపై 49 పరుగుల తేడాతో జయం 7

పశ్చిమ బెంగాల్‌కు తల్లీబిడ్డలు

- ఉపాధి కోసం జడ్చర్లకు వలస వచ్చిన దంపతులు 7
- గొడవ పడి భార్యను వదిలేసి వెళ్లిపోయిన భర్త
- గత డిసెంబర్‌లో మగ బిడ్డకు జన్మనిచ్చిన సంజన
- కోల్‌కతాలోని శక్తిసదన్‌కు తరలింపు



సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి రవినాయక్

భూసేకరణ వేగవంతం చేయాలి

- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి జి.రవినాయక్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాల భూసేకరణ, పునరావాస పనులు వేగవంతం చేయాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి జి.రవినాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని వీసీ హాల్‌లో కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి ఇరిగేషన్, రెవెన్యూ, విద్యుత్, మిషన్ భగీరథ, సర్వే అండ్ ల్యాండ్, రికార్డుల శాఖల అధికారులతో సమీక్షించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఉదండాపూర్ రిజర్వాయర్ భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ పనులు, కోయిల్ సాగర్, మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం భూసేకరణపై మాట్లాడారు. ఉదండపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా జడ్చర్ల మండలంలోని ఖానాపూర్, ఉందండపూర్, వల్లూరు, పోలేపల్లి, కిష్టారం రెవెన్యూ గ్రామాలు, అలాగే నవాబ్‌పేట మండలంలోని తీగలపల్లి, కారుకొండ, సిద్దోటం రెవెన్యూ గ్రామాల్లో 4,887.035 ఎకరాల వ్యవసాయ భూముల భూసేకరణకు గాను 4,876.185 ఎకరాలు సేకరించినట్లు తెలిపారు. ఉదండ పూర్ రెవెన్యూ గ్రామంలో మరో 10.24 ఎకరాలు సేకరించాల్సి ఉందన్నారు. 1,954 గృహ నిర్మాణాలకు గాను 60 ఎకరాలా 26 గంటలు సేకరణకు నోటిపై చేసినట్లు తెలిపారు. 667 గృహాలకు అవార్డ్ పాస్ చేసినట్లు చెప్పారు. 510 గృహాలకు టోకెన్లు జనరేట్ చేయగా, ఇంకా 161 గృహాలకు జనరేట్ చేయాల్సి ఉందన్నారు. ఆర్‌అండ్‌ఆర్ కింద తుమ్మలకుంట, రేగడిపట్టి, చిన్నగుట్ట, శ్యామగడ్డ, ఒంటిగుడిసె తండాల, పోలెపల్లి నిర్వాసిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించినట్లు తెలిపారు. జడ్చర్ల మండలంలోని పోలెపల్లిలో 125.13 ఎకరాలు, జడ్చర్లలో 149.19 ఎకరాలు మొత్తం 274.32 ఎకరాలను పునరావాస కాలనీల కోసం ప్రతిపాదించినట్లు తెలిపారు. మౌలిక వసతుల కల్పన పనులు ప్రగతిలో ఉన్నాయన్నారు.

లభించని రైతు ఆచూకీ 7

నత్తనడకన కలెక్టరేట్ నిర్మాణం

- నారాయణపేటలో 20 ఎకరాల్లో రూ.56 కోట్లతో పనులు
- కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపు ఆలస్యమే కారణం?

నిర్మాణంలో ఉన్న కలెక్టరేట్ భవనం



నారాయణపేట టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన, పారదర్శక సేవలు అందించేందుకు చేపట్టిన ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణం నారాయణపేటలో నత్తనడకన సాగుతోంది. నిధులు విడుదలలో ఆలస్యం వల్లే పనులు జరగడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. నారాయణపేట పట్టణానికి సమీపంలో సింగారం చౌరస్తా దగ్గర రోడ్లు, భవన నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో రూ.56 కోట్లతో సమీకృత కలెక్టరేట్‌ను నిర్మిస్తున్నారు. 20 ఎకరాల్లో అన్ని కార్యాలయాలు ఒకే దగ్గర ఉండేలా పనులు చేపడుతున్నారు. గౌరీ శంకర్ ఇన్‌ఫ్రా బిల్డ్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ పనులు చేస్తోంది. ఆరు బ్లాకులతో జీ ప్లస్ 2 అంతస్తులను నిర్మిస్తున్నారు. కాంట్రాక్టర్‌కు ఇప్పటి వరకు రూ.20 కోట్ల బిల్లులు చెల్లించినట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. ఈ ఏడాది అక్టోబరు 31 వరకు పనులు పూర్తి చేయాల్సి ఉంది.

నిర్మాణంలో మందగించిన వేగం..

కలెక్టరేట్ నిర్మాణంలో భాగంగా కాంట్రాక్టర్ గ్రౌండ్, మొదటి అంతస్తులకు స్లాబ్ వేశారు. అనంతరం ప్రభుత్వం మారింది. కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన డబ్బులు పెండింగ్‌లో ఉండటంతో పనుల్లో కూడా వేగం మందగించింది. అయితే కలెక్టర్, ఇద్దరు అదనపు కలెక్టర్ల క్యాంపు కార్యాలయాలు మాత్రం పూర్తి చేశారు. ముందుగా ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణం పూర్తి చేసి, కార్యాలయాలన్నింటిని ఒకే చోటకు తరలించి తమ ఇబ్బందులను తీర్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

తిరుగలేక ప్రజల అవస్థలు..

ప్రస్తుతం ప్రైవేటు భవనంలో కలెక్టరేట్‌ను నిర్వహిస్తున్నారు. స్థలాభావం వల్ల పలు విభాగాల కార్యాలయాలను ఇతర చోట్లకు తరలించారు. అయితే వివిధ కార్యాలయాల్లో పనుల నిమిత్తం వచ్చేవారు వేర్వేరు చోట్ల ఉన్న కార్యాలయాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయాలు ఎక్కడ ఉన్నాయో తెలియకపోవడంతో వాటిని వెతకడానికే గంటల తరబడి సమయం అవుతోందని వాపోతున్నారు. సమీకృత కలెక్టరేట్ త్వరగా పూర్తయితే అన్ని కార్యాలయాలు ఒకే చోట ఉండటం వల్ల ఆ సమస్యలన్నీ తీరుతాయని అంటున్నారు.

పనుల్లో వేగం పెంచాం

నిర్మాణ పనుల్లో వేగం పెంచాం. పనులు చేసిన మేరకు కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లిస్తున్నాం. గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. భవన సముదాయం కాంపౌండ్‌లోనే హెలిప్యాడ్ నిర్మించనున్నాం.

\- శరత్‌చంద్రారెడ్డి, ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఈఈ

జోగుళాంబ సన్నిధిలో ఐఏఎస్ అధికారి



ఐఏఎస్ అధికారి రజిత్ కుమార్ సైనికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

అలంపూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఐదవ శక్తి పీఠం అలంపూర్ జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను ఐఏఎస్ అధికారి రజత్ కుమార్ సైనీ మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అంతకుముందు వారికి ఆలయ అర్చకులు సాదర స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి ఆలయంలో గణపతి పూజ, అభిషేకం, అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన వంటి విశేష పూజలు చేశారు. ప్రస్తుతం ఆయన నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవోగా సేవలంది స్తున్నారు. వారి వెంట తహసీల్దార్ మంజుల, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

భారత్ జోలికొస్తే సహించేది లేదు

» బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీపాచారి



నాగర్‌కర్నూల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కందనూలు, మే 20 (ఆంధ్రజ్యోతి) : భారత్ జోలికొస్తే సహించేది లేదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీపాచారి అన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా బీజేపీ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో మంగళవారం సాయంత్రం తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు అధ్యక్షత వహించారు. బీజేపీ నాయకులు భరత్‌ప్రసాద్, కట్ట సుధాకర్‌రెడ్డి, బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రాజావర్ధన్‌రెడ్డి, పోల్‌దాస్ రాములుతో నాయకులు, కార్యకర్తలు జాతీయ పతకాలతో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ కూడలిలో దిలీపాచారి మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత సైన్యం చేపట్టిన దాడులను అభినందించారు. భారత్ జోలికొస్తే తగిన రీతిలో గుణపాఠం చెప్తామన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో దేశం అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు.

తల్లి మృతిపై అనుమానం

» పోలీసులకు ఫిర్యాదు చేసిన కుమార్తె

నాగర్‌కర్నూల్ క్రైం, మే 20 (ఆంధ్రజ్యోతి) : తల్లి జలగరి శ్యామల (45) మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆమె కుమార్తె పుట్నాల పల్లవి ఫిర్యాదు చేసినట్లు ఏఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కాలనీలో నివాసం ఉంటున్న జలగరి శ్యామల ఈనెల 15న అనారోగ్యానికి గురయ్యింది. పక్కింటి వారు ఆమెను జిల్లా ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. కాగా తన తల్లి మృతిపై అనుమానం ఉందని పేర్కొంటూ కుమార్తె పల్లవి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

భార్య,భర్తలపై దాడి

జడ్చర్ల, మే 20 (ఆంధ్రజ్యోతి) : దంపతులపై దాడి ఘటనలో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల ఎస్ఐ జయప్రసాద్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మునిసిపాలిటీలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన దంపతులు గంగారం బాలరాజు, ఆశమ్మలపై సోమవారం రాత్రి అదే కాలనీకి చెందిన నాగరాజు దాడి చేశాడు. దీంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. సంఘటనపై బాధితులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు

ఊర్కొండ, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న సంఘటనలో ఇద్దరిపైనా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణదేవ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, ఊర్కొండ మండలంలోని గుడిగానిపల్లి గ్రామానికి చెందిన కృష్ణకుమార్, బాల మైసయ్యల మధ్య సోమవారం రాత్రి వివాదం చెలరేగింది. సోమవారం రాత్రి ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. అనంతరం ఒకరిపై మరొకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వందేభారత్.. గద్వాలలో ఆగేనా?

- ఇప్పటికీ ఆగని నాలుగు ప్రధాన ఎక్స్‌ప్రెస్ రైళ్లు
- ప్రయాణికులకు తప్పని ఎదురుచూపు
- ఎంపీ డీకే అరుణ వినతితో ఆశలు



గద్వాల రైల్వేస్టేషన్ ముఖచిత్రం



రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎంపీ డీకే అరుణ (ఫైల్)

గద్వాల అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : నిజాం పరిపాలన కాలంలో 112ఏళ్ల క్రితం మీటర్‌గేజ్ రైల్వేలేన్ ఏర్పాటైంది.... 32 ఏళ్ల క్రితం అప్పటి భారత ప్రధాని, తెలంగాణ వాసి పీవీ నరసింహారావు చొరవతో బ్రాడ్ గేజ్‌గా మారిన గద్వాల రైల్వేలైన్ 14 ఏళ్ల క్రితం కాచిగూడ-రాయచూర్ డెమో రాకతో జంక్షన్‌గా రూపాంతరం చెందింది. జంక్షన్‌గా మారిన గద్వాల రైల్వేస్టేషన్ ఇప్పటికీ ఈ మార్గం మీదుగా వెళ్లే నాలుగు ప్రధాన ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ లేకపోవడం తీరని కొరతగా మిగిలింది. దీనికి తోడు ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వందేభారత్ రైలు వారానికి ఆరు రోజులు ఈ మార్గం గుండా వెళుతున్నా గద్వాలలో ఆగకపోవడం ఈ ప్రాంత ప్రయాణికులకు అందని ద్రాక్షగా మిగిలింది. ఇటీవల ఉమ్మడి జిల్లా పర్యటనకు వచ్చిన కేంద్ర రైల్వేశాఖ మంత్రి. అశ్వినీ వైష్ణవ్‌ను కలిసిన మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ గద్వాలలో వందేభారత్ రైలుహాల్ట్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం ఇవ్వడంతో ఈ ప్రాంత ప్రయాణికుల్లో ఆశలు చిగురించాయి.

ఆగని ప్రధాన రైళ్లు

ప్రతిరోజు వేలాదిమంది ప్రయాణించే గద్వాల రైల్వేస్టేషన్‌లో ఇప్పుడిప్పుడే కొన్ని సౌకర్యాలు మెరుగుపడుతున్నాయి. ఈ మార్గంలో వెళ్లే నాలుగు ప్రధాన రైళ్లు ఇక్కడ ఆగకపోవడం నిరాశను మిగిల్చింది. దశాబ్దాల పాటు ప్రజలు ఎదురుచూసిన గద్వాల - రాయచూర్ మార్గం 2012లో ప్రారంభమైనా ఇప్పటి వరకు ఆ మార్గం కేవలం ఒక ట్రిప్పు తిరిగే డెమో రైలుకే పరిమితమైంది. దేశ ఆర్థిక రాజధానిగా చెప్పుకునే ముంబయి, ఉమ్మడి రాష్ట్రానికి వ్యాపార కేంద్రంగా గుర్తింపు పొందిన విజయవాడను కలపడమే ప్రధాన లక్ష్యంగా ఏర్పాటైన గద్వాల-రాయచూర్ మార్గాన్ని అనుకున్న స్థాయిలో వినియోగించుకోవడంలో రైల్వేశాఖ నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గద్వాల రైల్వే స్టేషన్ మీదుగా పలు ప్రధాన రైళ్లు వెళుతున్నా వాటికి ఇక్కడ హాల్ట్ లేక పోవడం సమస్యగా మారింది. దీంతో గద్వాల నుంచి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు కర్నూలు లేదా హైదరాబాద్‌కు చేరుకుని వెళ్లే అవకాశం ఉండటంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గద్వాల రైల్వేస్టేషన్‌లో హాల్ట్‌లేని వాటిలో వారానికి ఒకసారి వెళ్లే హ జ్రత్ నిజాముద్దీన్-కోయంబత్తూర్ ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్-గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్, వారానికి రెండుసార్లు వెళ్లే యశ్వంత్‌పూర్-కోర్బా ఎక్స్‌ప్రెస్, వారానికి ఐదుసార్లు తిరిగే కర్ణాటక సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఉన్నాయి. వీటిలో యశ్వంత్‌పూర్ నుంచి గోరఖ్‌పూర్ రైలు (కాశీ) వారణాసికి వెళ్లే సౌకర్యం ఉన్నా గద్వాలలో హాల్ట్ లేకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. కర్ణాటక సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్‌కు గద్వాల హాల్ట్ ఉంటే తమకు కూడా సౌకర్యవంతంగా ఉంటుందని రాయచూర్ ప్రాంతానికి చెందిన ప్రయాణికులు ఎన్నోసార్లు విజ్ఞప్తులు చేసినా పట్టింపు లేకపోవడం గమనార్హం. ఈ ఎక్స్‌ప్రెస్ గద్వాలలో హాల్ట్ ఉంటే ఉత్తర కర్ణాటకలోని అతిపెద్ద వ్యాపార కేంద్రమైన రాయచూర్ ప్రాంత వ్యాపారులకు అనువుగా ఉంటుందన్నది వారి అభిప్రాయంగా ఉంది. వీటితో పాటు ఇటీవల కాచిగూడ నుంచి యశ్వంత్‌పూర్‌కు వెళ్లే వందేభారత్ రైలును మహబూబ్‌నగర్ స్టేషన్ తర్వాత అతిపెద్ద స్టేషన్‌గా ఉండి, అత్యధిక ఆదాయాన్ని అందిస్తున్న గద్వాలలో ఆపడం వల్ల అటు రైల్వేకు ఆదాయం, ఇటు ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందన్నది ప్రధానంగా వినిపిస్తున్న వాదన.

వందేభారత్‌ను ఆపాలి



గద్వాల మీదుగా వారానికి ఆరు రోజులు తిరిగే వందేభారత్ రైలును గద్వాల జంక్షన్‌లో హాల్ట్ చేయాలి. నడిగడ్డ ప్రాంతం నుంచి బెంగళూరుకు వెళ్లేవారు, అక్కడే స్థిరపడిన అనేక కుటుంబాలతో బంధుత్వాలు, వ్యాపార లావాదేవీలు ఎక్కువగా ఉన్నందున ఈ రైలు వల్ల అందరికీ ఉపయోగకరం గా ఉంటుంది.

- ఎస్‌వీ రమణ, ఉపాధ్యాయుడు, గద్వాల

సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్‌ను హాల్ట్ చేయాలి



బెంగళూరు నుంచి ఢిల్లీకి వెళ్లే సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలుకు గద్వాల స్టేషన్‌లో హాల్ట్ ఏర్పాటు చేస్తే 50కిలోమీటర్ల దూరంలో ఉన్న రాయచూర్‌కు సౌకర్యంగా ఉంటుంది. రాయచూర్ మీదుగా ఢిల్లీకి వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లో సకాలంలో బెర్త్‌లు లభించని ప్రయాణికులకు గద్వాల స్టేషన్ మాత్రమే అందుబాటులో ఉంటుంది.

- రాఘవేంద్ర రెడ్డి, రాయచూర్

భక్తిశ్రద్ధలతో అబ్దుల్లాషా సాహెబ్ ఉర్సు



ఉర్సు ఉత్సవాలకు హాజరైన నాయకులు

మూసాపేట, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని హజ్రత్ అబ్దుల్లాషా సాహెబ్ ఉర్సు మంగళవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామం నుంచి ఉర్సు గంధం ఊరేగింపుగా బయలుదేరి దర్గాకు చేరుకుంది. ఈ సందర్భంగా దర్గాలో మతపెద్దల సమక్షంలో గంధం, పూల సమర్పణ, నైవేద్యం, ఫాతేహా, దువా, సలాం కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి కులమతాలకతీతంగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ బాలయ్య, మసీద్ కమిటీ అధ్యక్షుడు ఖాజా మైనోద్దిన్, పెష్‌ఇమామ్ ముఖ్తార్‌అహ్మద్, మాజీ ఉప సర్పంచ్ ఎండీ కలీం, అబ్దుల్ ఖాదర్, నిరంజన్, ఖదీర్, ఖలీల్, ఆజం పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా శివపార్వతుల కల్యాణం

» ప్రారంభమైన అంజన్న ఉత్సవాలు



శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

మహమ్మదాబాద్ మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాధిర్యాల్ గ్రామంలో వీరహనుమాన్ ఆలయంలో హనుమత్ జయంతిని పురస్కరించుకొని అంజన్న ఉత్సవాలు మంగళవారం అంగరంగ వైభంగా ప్రారంభమైయ్యాయి. ఉదయం సుప్రభాత మహాగణపతి గౌరి పూజ కార్యక్రమాలతో వేడుకలు ప్రారంభంకాగా, శివపార్వతుల కల్యాణం కనుల పండుగా నిర్వహించారు. అనతంరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం నుంచి స్వామి వారి పల్లకీ సేవ నిర్వహించారు. మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రామ్‌రెడ్డి, అంజలిలమ్మ, ఎంపీటీసీ మాజీ సభ్యులు రాములమ్మ, ఆలయ కమిటీ చైర్మన్ అంజనాచారి పాల్గొన్నారు.

ఎన్నాళ్లిలా..?

- సొంతింటి కోసం పేదల ఎదురుచూపులు
- నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో పంపిణీకి నోచుకోని డబుల్ బెడ్రూం ఇళ్లు
- 90 శాతం నిర్మాణం పూర్తయినా మిగతా పెండింగ్ పనులు పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు



జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్లు

నాగర్‌కర్నూల్ టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): సొంతింటి కలను నిజం చేసేందుకు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్మించిన రెండు పడకల గదుల ఇళ్లు పేద ప్రజలకు అందని ద్రాక్షగా మారాయి. నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి చేసుకున్నా అర్హులైన వారికి అందించడంలో జాప్యం జరుగుతోంది. తుది దశకు చేరుకున్న నిర్మాణ పనులు పూర్తి కాకపోవడం వల్ల సామాన్యులు గూడు లేక అవస్థలు పడుతున్నామంటూ గోడు వెళ్లబోసుకుంటున్నారు.

జిల్లా కేంద్రంలోని బస్ డిపో సమీపంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. దాదాపుగా ఆరేళ్ల క్రితం ఒక్కో బ్లాకులో 32 ఇళ్ల చొప్పున ఆరు బ్లాకుల్లో మొత్తం 192 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి పనులను ప్రారంభించారు. దాదాపుగా 90 శాతం నిర్మాణ పనులు పూర్తి చేసుకున్నా పెండింగ్ పనులు పూర్తి చేయడంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. గదుల నిర్మాణం పూర్తయినా ప్లంబింగ్, ఫ్లోరింగ్, డోర్లు, కిటికీలకు గ్లాస్ ఫిటింగ్, విద్యుత్ వైరింగ్, పేయింటింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. గత పాలకుల అలసత్వం కారణంగా పెం డింగ్ పనులు పూర్తి చేసుకుని లబ్ధిదారులకు పంపిణీకి నోచుకోలేదు. ఇదిగో, అదిగో అంటూ ఊదరగొట్టి చివరకు తమకు ఇల్లు లేకుండా చేశారని లబ్ధిదారులు వాపోతున్నారు. నిర్మాణ పనులు పూర్తి చేసుకుని లబ్ధిదారులకు అందకపోవడంతో పర్యవేక్షణ కరువై అవి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. డబుల్ ఇళ్ల అన్ని బాకుల్లో మద్యం సీసాలు, సిగరేట్ పాకెట్లతో దర్శనమిస్తున్నాయి. కొన్ని బ్లాకుల్లో కిటికీలను ధ్వంసం చేసి వాటికి బిగించిన ఇనుప చువ్వలను ఎత్తుకుపోయారు.



జిల్లా కేంద్రంలోని ఊడగొట్టిన డబుల్ బెడ్రూం ఇళ్ల మెట్లపై పగులగొట్టిన మద్యం బాటిళ్లు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తయినా జిల్లా కేంద్రంలో ఉన్న డబుల్ బెడ్రూం పెండింగ్ పనుల గురించి పట్టించుకోవడం లేదు. కనీసం ఇప్పటికైనా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న తమకు సొంతింటి కల నెరవేర్చాలని కోరుతున్నారు.

పనులు పూర్తి చేసి పంపిణీ చేయాలి..



నిరుపేదలకు ఇల్లు కట్టించి ఆదుకుంటామని పాలకులు గొప్పలు చెప్పడమే తప్పా ఆచరణలో పెట్టడం లేదు. జిల్లా కేంద్రంలోని డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులు ఎప్పుడు పూర్తి చేస్తారో తెలియడం లేదు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ పనులను పూర్తి చేసి అర్హులైన నిరు పేదలకు పంపిణీ చేయాలి.

- పొదిల రామయ్య, సీపీఎం మండల కార్యదర్శి, నాగర్‌కర్నూల్



జిల్లా కేంద్రంలోని ఊడగొట్టిన డబుల్ బెడ్రూం ఇళ్ల కిటికీ పెచ్చులు ఊడగొట్టిన దృశ్యం

ఆగని ఆర్థిక మోసాలు

» జోగుళాంబ గద్వాల జిల్లా అయిజలో అలజడి

» గత ఏడాది ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ. 50 కోట్లు కొల్లగొట్టిన సంస్థ

» తాజాగా రూ. కోటి అప్పు చేసి ఐపీ పెట్టిన వ్యాపారి

అయిజ టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ పట్టణంలో ఆర్థిక మోసాలు ఆగడం లేదు. తాజాగా అయిజ పట్టణానికి చెందిన ఓ వ్యాపారి రూ. కోటికి పైగా అప్పులు చేసి, ఐపీ పెట్టి ఉడాయించాడు. దీంతో గత ఏడాది జరిగిన ఆన్‌లైన్ ట్రేడింగ్ వ్యవహారం మరోసారి చర్చనీయాంశం అయ్యింది. అయిజ పట్టణంలో గత ఏడాది మేలో ఓ వ్యక్తి కొందరు స్థానికులతో కలిసి 'ఏజీజీకే ట్రేడర్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్' పేరుతో ఓ సంస్థను ఏర్పాటు చేశారు. నిర్వాహకులు తెలివిగా గుజరాత్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి పేరుతో దీన్ని రిజిస్ట్రేషన్ చేశారు. ఈ సంస్థ స్థానికంగా కొందరు ఏజెంట్లను నియమించుకున్నది. వారి ద్వారా తమ సంస్థలో రూ. లక్ష పెట్టుబడి పెడితే ప్రతీ నెల రూ. 20 నుంచి రూ. 40 వేల వరకు వడ్డీ ఇస్తామని చెప్పి ప్రజలను నమ్మించింది. ఇలా చాలా మందితో డబ్బు తీసుకున్న నిర్వాహకులు మరింత నమ్మకం కలిగించేందుకు కొందరికి పోస్ట్ డేటెడ్ చెక్కులు కూడా ఇచ్చారు. దీంతో చాలా మంది ఈ సంస్థలో పెట్టుబడులు పెట్టారు. తీరా ఇదే ఏడాది ఆగస్టులో సదరు సంస్థ బోర్డు తిప్పేసింది. ఈ వ్యవహారంపై అయిజ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి గత ఏడాది అక్టోబరులో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. తీరా కోట్ల రూపాయలు కొల్లగొట్టిన నిర్వాహకులు థాయ్‌లాండ్‌లో ఉన్నట్లు అప్పట్లో బాధితులే గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆ తర్వాత ఏమయ్యిందో కానీ విషయం మాత్రం సద్దుమణిగింది.

తాజాగా మరో సంఘటన

గత ఏడాది జరిగిన సంఘటనను మరువక ముందే తాజాగా కోటి రూపాయలు అప్పు చేసి ఐపీ పెట్టిన వ్యాపారి ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఆ వ్యాపారికి పట్టణానికి చెందిన ఒక ప్రముఖుడి కుటుంబ సభ్యులు పెద్దమొత్తంలో అప్పు ఇచ్చినట్లు తెలిసింది. తిరిగి చెల్లించాలంటూ వారు 10, 15 రోజులుగా ఆ వ్యాపారిపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. లేకపోతే పోలీసులను ఆశ్రయించాల్సి వస్తోందని హెచ్చరించినట్లు తెలుస్తోంది. దీంతో సమస్య పెద్దదవుతుందని భావించిన ఆ వ్యాపారి ఐపీ పెట్టినట్లు స్థానికంగా చర్చ కొనసాగుతోంది.

వ్యక్తం అవుతున్న అనుమానాలు

ఓ చిరు వ్యాపారికి పలువురు కోటి రూపాయల వరకు అప్పులు ఇవ్వడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అతడు 5, 10 రూపాయలు వడ్డీ ఎలా ఇవ్వ గలడని, ఇది కూడా ఆన్‌లైన్ ట్రేడింగ్ లాంటి వ్యవహారమేనా అని చర్చించుకుంటున్నారు. ఈ వ్యాపారి దాదాపు మూడు, నాలుగేళ్లుగా అధిక వడ్డీలకు అప్పులు చేయడం, గత ఏడాది ఆన్‌లైన్ ట్రేడింగ్ వ్యవహారం జరగడం చూస్తే రెండు సంఘటనల మధ్య లింకేమైనా ఉందా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

అప్పుడు భర్త.. ఇప్పుడు కూతురు

- మతిస్థిమితం లేక మట్టుపెట్టిన మహిళ



మృతి చెందిన చిన్నారి నవనీత

అచ్చంపేట టౌన్, (లింగాల) మే 20 (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం లేని తల్లి తన కూతురిని గొంతు నుమిలి నీటి సంపులో వేసి చంపిన ఘటన నాగర్ కర్నూలు జిల్లా లింగాల మండలం చెన్నంపల్లి గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకున్నది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మేకల ఎలమ్మ, రాములు దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. రెండవ కుమార్తె మేకల నవనీత (6)ను సోమవారం అర్ధరాత్రి తల్లి ఎల్లమ్మ గొం తునుమిలి నీటి సంపులో పడేసింది. కొంత సమయం తర్వాత నిద్రలేచిన మేకల రాములు తమ్ముడు మేకల కుర్మయ్య అమ్మాయి లేకపోవడంతో బయట వెతకగా నీటిసంపులో ఉన్న చిన్నారిని చూసి బయటకు తీశారు. అప్పటికే ఆ చిన్నారి మృతి చెందింది. మేకల ఎల్లమ్మ ఐదు నెలల క్రితం కూడా భర్త రాములును గొడ్డలితో నరికిచంపింది. ఆ ఘటనలో జైలుకు కూడా వెళ్లి వచ్చింది. ఆ సంఘటనను మరువక ముందే కూతుర్ని కూడా చంపడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకొని సంఘటనా స్థలానికి చేరుకొని ఎల్లమ్మను అదుపులోకి తీసుకొని విచారిస్తు న్నట్లు ఎస్సై వెంకటేష్ గౌడ్ తెలిపారు. ఆమెకు మతిస్థిమితం లేకపోవడం వల్లే ఈ ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి తీవ్ర గాయాలు

» ఇద్దరికి తీవ్ర గాయాలు

పెద్దకొత్తపల్లి/ నాగర్‌కర్నూల్ క్రైం/ అలంపూర్ చౌరస్తా, మే 20 (ఆంధ్రజ్యోతి) : నాగర్ కర్నూల్, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి మండలంలోని సాతాపూర్ రసూల్ చెరువు వద్ద టీవీఎస్, బైక్ ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. సాతాపూర్ గ్రామానికి చెందిన బాయికాడి బాల్ చంద్రయ్య (50) టీవీఎస్‌పై గంట్రావుపల్లి స్టేజ్ సమీపంలో ఉన్న పెట్రోల్ బంక్‌కు వెళ్తున్నాడు. వనపర్తి జిల్లా రేవల్లి మండల కేంద్రానికి చెందిన గుర్తు తెయని వ్యక్తి (60) గ్లామర్ బైక్‌పై నాగర్‌కర్నూల్ వైపు వస్తున్నారు. రెండు వాహనాలు రసూల్ చెరువు సమీపంలో ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. దీంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బైక్‌పై ఉన్న వ్యక్తి తలకు తీవ్ర గాయం కావడంతో 108 అంబులెన్సులో నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. బాలచంద్రయ్యను ఆటోలో పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కారు, టీవీఎస్ ఢీకొని..

నాగర్‌కర్నూల్ క్రైం (ఆంధ్రజ్యోతి) : టీవీఎస్ ఎక్స్ఎల్, ఇన్నోవా కారు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఏఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండలం గట్టురాయిపాకులకు చెందిన చటమోని రాములు(40) మంగళవారం జిల్లా కేంద్రానికి వచ్చి ఇంటి తిరిగి వెళ్తుండగా, కొల్లాపూర్ చౌరస్తాలో ఇన్నోవా కారు ఢీకొన్నది. ప్రమాదంలో రాములు తీవ్రంగా గాయపడటంతో స్థానికులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై రాములు భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

అలంపూరు చౌరస్తా (ఆంధ్రజ్యోతి) : బైక్, ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఉండవల్లి ఎస్ఐ మహేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్నూలు జిల్లా చనుగొండ్ల గ్రామానికి చెందిన కుమ్మరి మునిస్వామి అతడి స్నేహితులు సూర్యశేఖర్, మహేశ్, రాఘవేందర్‌లు రెండు బైక్‌లపై జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండలం, పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద టీ తాగేందుకు వచ్చారు. తిరిగి వెళ్తుండగా దూన్ దాబా వద్ద మునిస్వామి, సూర్యశేఖర్ వెళ్తున్న బైక్‌ను ఓ ప్రయివేటు ట్రావెల్ బస్సు అతి వేగంగా వస్తూ వెనుకనుంచి ఢీకొన్నది. దీంతో మునుస్వామి తలకు తీవ్ర గాయం కావడంతో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. సూర్యశేఖర్ చెయ్యి మీద నుంచి టైర్ వెళ్లడంతో నలిగి పోయింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

క్రైం కార్నర్

మద్యం తాగొద్దన్నందుకు మహిళ ఆత్మహత్య

రాజాపూర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : మహబుబ్‌నగర్ జిల్లా, రాజాపూర్ మండలం చెన్నవెల్లి గ్రామంలో సోమవారం ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పొట్ట పద్మమ్మ (62) ప్రతీ రోజు కల్లు, మద్యం తాగుతుండేది. దీంతో మద్యం తాగొద్దని కొడుకు ఆమెను మందలించాడు. దీంతో సోమవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఆమె గ్రామ శివారులోని మర్రి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. సంఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో కాడెద్దు మృతి


విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన కాడెద్దు

బల్మూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, బల్మూరు మండలం మైలారం గ్రామానికి చెందిన రైతు ఎల్లికంటి జగదీశ్వర్‌కు చెందిన కాడెద్దు సోమవారం రాత్రి కరెంట్ షాక్‌తో చనిపోయింది. ఎద్దును పొలంలో కట్టేసి ఇంటికి వెళ్లగా, అది తాడు తెంచుకొని వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గడ్డి మేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై చనిపోయిందని రైతు తెలిపాడు. దాని విలువ రూ. 50 ఉంటుందని చెప్పాడు.

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన రేషన్ బియ్యం

మదనాపురం, మే 20 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, మదనాపురం మండలంలోని నెల్విడి గ్రామ శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామ శివారులోని ఓ కోళ్ల ఫామ్ వద్ద మదనాపురం గ్రామానికి చెందిన వడ్డె మహేశ్ దాదాపు 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచాడు. సమాచారం అందుకున్న పోలీసులు తనిఖీలు నిర్వహించి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు జిల్లా పౌర సరఫరా శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్

రేవల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, రేవల్లి మండలంలోని తలుపునూరు గ్రామంలో వరుసగా రెండవ రోజు అక్రమ ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం ఉదయం నాలుగు గంటల సమయంలో సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి వెళ్లి ట్రాక్టర్ ను పట్టుకొని తనిఖీ చేశారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపారు.

లభించని రైతు ఆచూకీ


అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్లతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్ పుష్పలత

కృష్ణ, మే 20(ఆంధ్రజ్యోతి) : భీమా నదిలో మోటర్ ఫుట్‌బాల్ మరమ్మతు కోసం నీటిలోకి దిగిన రైతు జింకల తిప్పన్నను మొసలి లాక్కెళ్లి నాలుగు రోజులు గడిచినా అతడి ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం ఇన్‌చార్జి తహసీల్దార్ పుష్పలత, ఎస్‌ఐ నవీద్ ఆధ్వర్యంలో అగ్నిమాపక దళం, రెస్క్యు బృందం భీమానదిలో గాలింపు చర్యలు చేపట్టారు. రైతు గల్లంతు అయిన ప్రదేశంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోయింది. మధ్యాహ్నం మేఘాలు కమ్ముకోవడంతో గాలింపు చర్యలను నిలిపివేశారు. బుధవారం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

హడలెత్తించిన నాగు పాము


పామును పట్టుకుంటున్న స్నేక్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు కృష్ణ సాగర్

వనపర్తి రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, మర్రికుంట గురుకుల పాఠశాల మైదానంలో మంగళవారం పెద్ద నాగుపాము కనిపించింది. పడగ ఎత్తి బుసలు కొడుతూ హడలెత్తించింది. గమనించిన పాఠశాల ఉపాధ్యాయుడు ఒకరు దాన్ని చేసి భయంతో కేకలు వేశాడు. దీంతో అది సమీపంలోని విద్యుత్ స్తంభం పక్కనున్న రంధ్రంలో దూరింది. ఆ ఉపాధ్యాయుడు స్నేక్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు కృష్ణసాగర్‌కు సమాచారం అందించడంతో ఆయన అక్కడకు చేరుకున్నారు. చాకచక్యంగా పామును పట్టుకుని డబ్బాలో బంధించాడు. దానిని అటవీ ప్రాంతంలో వదిలేస్తానని ఆయన తెలిపారు.


టబ్‌లో మామిడి కాయలు నింపుతున్న రైతు వెంకటయ్య


మామిడి కాయల ఒరుగు తయారీలో గ్రామస్థులు

మామిడి ఒరుగు.. సంపాదన మెరుగు

- ఏపీ, కర్ణాటకల నుంచి కాయల దిగుమతి
- కోసి ఎండ బెట్టి, ఒరుగు చేసి ఎగుమతి
- పల్లె జనానికి రోజంతా కావలసినంత పని
- దాదాపు రెండు నెలల పాటు ఉపాధి


ఆరబోసిన మామిడి ఒరుగు

నవాబ్‌పేట, మే 20 (ఆంధ్రజ్యోతి) : పల్లె జనానికి మామిడి ఒరుగు ఉపాధి చూపుతోంది. వేసవిలో దాదాపు రెండు నెలలు కడుపు నింపుతోంది. ఈ సీజన్‌లో సాధారణంగా గ్రామీణ ప్రజలు, ప్రధానంగా మహిళలు మామిడి పండ్లు విక్రయిస్తుంటారు. తోటలు ఉన్న రైతులు కొందరు నేరుగా ప్రజలకు పచ్చడి కాయలు అమ్ముతుంటారు. మరికొందరు మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. అందుకు భిన్నంగా మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాల సరిహద్దు మండలాల్లో మామిడి ఒరుగు తయారు చేసి జీవనోపాధి పొందుతున్నారు.

ఒక వ్యక్తితో ప్రారంభం

ఒక వ్యక్తితో ప్రారంభమైన మామిడి ఒరుగు తయారీ ఇప్పుడు దాదాపు ఐదారు గ్రామాల్లో కొనసాగుతోంది. రుద్రారం గ్రామానికి చెందిన వెంకటయ్య గౌడ్ 12 ఏళ్ల క్రితం మామిడి ఒరుగు తయారీని ప్రారంభించాడు. అతడి స్ఫూర్తితో మరికొంత మంది ఈ వ్యాపారంలోకి అడుగుపెట్టారు. ఇలా చుట్టుపక్కల గ్రామాల్లోనూ విస్తరించింది. ప్రస్తుతం ప్రతి గ్రామంలో 10 నుంచి 15 మంది మామిడి ఒరుగు తయారు చేయిస్తున్నారు. ఒక్కో వ్యక్తి వద్ద దాదాపు 30 మహిళలు పని చేస్తారు. వారంతా మామిడి కాయలను కోసి ముక్కలు చేసి ఎండ పెట్టి ఒరుగు తయారు చేస్తారు.

రూ. 50 వేల వరకు ఆదాయం

ఒరుగు తయారీకి అవసరమైన మామిడి కాయలు స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్, అనంతపూర్, కర్ణాటకలోని బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటారు. ఇంటిల్లిపాది కలిసి వాటిని ముక్కలుగా కోసి ఎండబెట్టి ఒరుగు తయారు చేస్తారు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో విద్యార్థులు కూడా తల్లి దండ్రులతో కలిసి ఈ పనిలో నిమగ్నం అవుతారు. తమ చదువుకు, పుస్తకాల కొనుగోలుకు అవసరమైన డబ్బు సంపాదించు కుంటారు. ఇలా సీజన్ ముగిసే వరకు ఒక్కో మహిళ రూ. 30 నుంచి రూ. 50 వేల వరకు సంపాదించుకుంటుంది.

ప్రస్తుతం రుద్రారం, రాంసింగ్ తండా, మరికల్, కన్మన్‌కాల్వ, కొత్తపల్లి తది తర గ్రామాల్లో మామిడి ఒరుగు తయారీ జోరుగా సాగుతోంది. గ్రామంలో ఎక్కడ చూసిన ఎండబెట్టిన ఒరుగు కనిపిస్తోంది. స్థానికంగా మార్కెటింగ్ సదుపాయం లేకపోవడంతో ఒరుగును నిజామాబాద్ జిల్లాకు తీసుకెళ్లి విక్రయిస్తారు. అక్కడి నుంచి ఇతర రాష్ట్రాలతో పాటు, దేశాలకు కూడా ఎగుమతి అవుతుంది.

అందరూ ఆలోచించాలి



ఎవరో వచ్చి పని చూపిస్తారని అనుకోవద్దు. అందుబాటులో ఉన్న పనులపై దృష్టి సారించాలి. స్వయం ఉపాధి దిశగా ప్రతీ ఒక్కరికీ ఉపాధి లభిస్తోంది. ఈ సీజన్‌లో మామిడి ఒరుగు తయారీతో ప్రతీ ఒక్కరికీ పని దొరుకుతుంది. వచ్చే డబ్బుతో కుటుంబ అవసరాలు తీర్చుకోవచ్చు. పిల్లల చదువులకు ఖర్చు చేసుకోవచ్చు.

- నవీన్ గౌడ్, రుద్రారం

ఉన్న చోటే ఉపాధి



ప్రతీ వేసవిలో మామిడికాయల ఒరుగు తయారీతో మాకు ఉన్న చోటే పని దొరుకుతోంది. ఈ రెండు నెలల పాటు కష్టపడి పని చేసుకుంటాం. వచ్చిన డబ్బుతో కుటుంబ అవసరాలు తీర్చుకోవడంతో పాటు, వ్యవసాయానికి ఉపయోగించుకుంటాం.

- అరుణమ్మ, రుద్రారం

ఇంటిల్లిపాదికీ పని



ఉపాధి పనులకు వెళ్తే సకాలంలో డబ్బు చేతికి రాదు. వంద రోజులు పూర్తయితే పని ఉండదు. కానీ ఒరుగు తయారీతో ఇంటిల్లిపాదికి పని ఉంటుంది. మా ఊర్లో చాలా మంది ఒరుగు తయారీతో లబ్ధి పొందుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పని చేసుకొని డబ్బు సంపాదించుకుంటున్నాం.

- పార్వతమ్మ, రుద్రారం

2డే క్రికెట్ టోర్నీలో పాలమూరు గెలుపు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్


గెలిచిన మహబూబ్‌నగర్ జట్టుతో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ మే 20 (ఆంధ్రజ్యోతి) : క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంట్రా డిస్ట్రిక్ 2 డే అండర్-23 క్రికెట్ టోర్నీలో మహబూబ్‌నగర్ జట్టు జడ్చర్లపై 49 పరుగుల ఇన్నింగ్స్ తేడాతో విజయం సాధించింది. తొలి ఇన్నింగ్‌లో మహబూబ్‌నగర్ జట్టు 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 420 పరుగులకు డిక్లేర్ చేసింది. నగరం సమీపంలోని తిరుమలహిల్స్‌లో గల సమర్థ పాఠశాల మైదానంలో మంగళవారం జరిగిన రెండో ఇన్నింగ్స్‌లో 40 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 206 పరుగులు మాత్రమే చేసింది. జట్టులో కేతన్‌కుమార్ 106 బంతుల్లో 16 ఫోర్లతో సెంచరీ (101) సాధించాడు. సంజయ్ 45 పరుగులు చేశాడు. 49 పరుగుల ఇన్నింగ్స్ తేడాతో పాలమూరు గెలిచింది. జట్టులో శశంక్ 2, షాదాబ్‌అహ్మద్ 2, డేవిడ్ క్రిపాల్ 1 వికెట్ తీశారు. బోనస్‌తో ఒకటితో కలిపి మహబూబ్‌నగర్ 6 పాయింట్లు సాధించింది.

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తోందని మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లా కేంద్రం సమీపంలోని సమర్థ పాఠశాల మైదానంలో జరుగుతున్న అండర్-23 ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్ రెండో రోజు పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి జాతీయ జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్రికెట్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షుడు సురేశ్‌కుమార్, కోచ్ గోపాలకృష్ణ, సీనియర్ క్రీడాకారుడు ఆబిద్‌హుసేన్ పాల్గొన్నారు.

పశ్చిమ బెంగాల్‌కు తల్లీబిడ్డలు

- ఉపాధి కోసం జడ్చర్లకు వలస వచ్చిన దంపతులు
- గొడవ పడి భార్యను వదిలేసి వెళ్లిపోయిన భర్త
- గత డిసెంబరులో మగ బిడ్డకు జన్మనిచ్చిన సంజన
- ఇద్దరినీ కోల్‌కతాలోని శక్తిసదన్‌కు తరలింపు


పశ్చిమబెంగాల్‌కు చెందిన సంజన, పసిపాపను జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రం నుంచి కోల్‌కత్తాలోని డైరెక్టరేట్ ఆఫ్ సోషల్‌వెల్‌ఫేర్ శక్తిసదన్‌కు తరలిస్తున్న సఖి సెంటర్ అడ్మిన్ సౌజన్య, సిబ్బంది

జడ్చర్ల, మే 20 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ బెంగాల్‌కు చెందిన దంపతులు జీవనోపాధి కోసం మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్లకు వలస వచ్చారు. వారిద్దరి మధ్య గొడవ జరగడంతో భర్త ఆమెను వదిలేసి వెళ్లిపోయాడు. అప్పటికే గర్భవతిగా ఉన్న ఆమె మొగ బిడ్డకు జన్మనిచ్చింది. స్థానికంగా ఏ దిక్కు లేని వారిద్దరినీ మహబూబ్‌నగర్ సఖి కేంద్రం నిర్వాహకులు పశ్చిమబెంగాల్‌కు పంపించారు. సఖి కేంద్రం అడ్మిన్ సౌజన్య తెలిపిన వివరాల మేరకు... పశ్చిమబెంగాల్ రాష్ట్రం, సౌత్ 24 పర్గణాస్, గంగాసాగర్ గ్రామానికి చెందిన సంజన, లక్కి దంపతులు జీవనోపాధి కోసం గత ఏడాది డిసెంబరులో జడ్చర్ల మండలం పెద్దపల్లికి వలస వచ్చారు. ఆ సమయంలో సంజన గర్భవతిగా ఉంది. కాగా భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో భర్త లక్కీ సంజనను వదిలేసి స్వగ్రామానికి వెళ్లిపోయా డు. గత ఏడాది డిసెంబరు 31న ఆమెకు పురుటి నొప్పులు రావడంతో ఇరుగు, పొరుగు వారు జడ్చర్ల ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం ఆమెను ఆ సుపత్రిలో చేర్చారు. ఆ తర్వాత పుట్టిన బాబును విక్రయించేందుకు ప్రయత్నిస్తోందన్న అనుమానంతో స్థానికులు సఖి కేంద్రం నిర్వాహకులకు సమాచారం అందించారు. దీంతో వారు సంజనతో పాటు పుట్టిన బాబును జనవరి 4న తమ అధీనంలోకి తీసుకుని జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రానికి తరలించారు. జనవరి 8వ తేదీ వరకు తమ అధీనంలో ఉన్న సంజన, పసి పాపలను జిల్లా కేంద్రంలోని స్టేట్‌హోంకు తరలించారు. ఆ తర్వాత డీడబ్ల్యువో జరీనాబేగం సహకారంతో పశ్చిమబెంగాల్ డైరెక్టరేట్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ అధికారులను సంప్రదించారు. కానీ సంజన కుటుంబ సభ్యుల వివరాలు తెలియలేదు. దీంతో తల్లీబిడ్డలను కోల్‌కతాలోని శక్తిసదన్‌లో లాంగ్‌టర్మ్ షెల్టర్ ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. అందుకోసం తల్లీబిడ్డలను మంగళవారం జిల్లా కేంద్రం నుంచి పశ్చిమబెంగాల్‌కు పంపించారు.

తగ్గిన ఎండల తీవ్రత

వనపర్తి/నారాయణపేట, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఎండల తీవ్రత కొద్దిగా తగ్గింది. ఐదు రోజులుగా వాతావరణం చల్లబడింది. రెండు రోజులకు ఒకసారి మోస్తరు వర్షం కురుస్తుండటంతో ఒక్కసారిగా ఎండ తీవ్రత నుంచి ప్రజలకు ఉపశమనం కలిగింది. మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లాలో గరిష్ఠం 37.0 డిగ్రీలు, కినిష్ఠం 28.3 డిగ్రీలు.

వనపర్తి జిల్లా మదనా పూర్ మండలంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 35.6 డిగ్రీలు, కనిష్ఠం వీపనగండ్లలో 25.9 డిగ్రీలు నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లాలో గరిష్ఠం 35 డిగ్రీలు, కనిష్ఠం 27 డిగ్రీలు, నారాయణపేట, నాగర్‌కర్నూలు జిల్లాల్లో గరిష్ఠం 33 డిగ్రీలు, కనిష్ఠంగా 24 డిగ్రీలు నమోదైంది.

జాతీయ స్థాయికి ఎదగాలి

- డీవైఎస్‌వో శ్రీనివాస్


నెట్‌బాల్ టోర్నీలో విజేతగా నిలిచిన జిల్లా జట్టును అభినందిస్తున్న డీవైఎస్‌వో శ్రీనివాస్

మహబూబ్‌నగర్‌స్పోర్ట్స్, మే 20(ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని డీవైఎస్‌వో శ్రీనివాస్ ఆకాంక్షించారు. జనగాంలో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించిన నెట్‌బాల్ రాష్ట్ర స్థాయి మిక్స్‌డ్ సబ్ జూనియర్ టోర్నీలో మహబూబ్‌నగర్ బాలుర జట్టు స్వర్ణ పతకం, నెట్‌బాల్ 4వ ఫాస్ట్ - 5 తెలంగాణ సబ్ జూనియర్ చాంపియన్‌షిప్‌లో మహబూబ్‌నగర్ బాలికల జట్టు కాంస్య పతకం సాధించాయి. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా స్టేడియంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాకారులను డీవైఎస్‌వో అభినందించారు. కార్యక్రమంలో నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ ఖాజాఖాన్, కోచ్ అంజద్‌అలీ, షరీఫ్ పాల్గొన్నారు.

క్రికెట్ లీగ్‌లో నాగర్‌కర్నూల్ జట్టు విజయం


నాగర్‌కర్నూల్ క్రికెట్ లీగ్‌లో విజయం సాధించిన జిల్లా జట్టు

నాగర్‌కర్నూల్ టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-23 క్రికెట్ లీగ్ టోర్నమెంటులో నాగర్‌కర్నూల్ జిల్లా జట్టు విజయం సాధించింది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఏబీసీ మైదానంలో నిర్వహిస్తున్న టోర్నీలో రెండవ రోజు నాగర్‌కర్నూల్, వనపర్తి జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వనపర్తి జట్టు 39.1 ఓవర్లలో 138 పరుగులు చేసి ఆల్‌అవుట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్ చేసిన నాగర్‌కర్నూల్ జట్టు నిర్ణీత ఓవర్లలో 127 పరుగులు చేసి ఆల్ అవుట్ అయ్యారు. రెండో ఇన్నింగ్స్‌లో వనపర్తి జట్టు 74 పరుగులు చేసింది. 75 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నాగర్‌కర్నూల్ జట్టు ఆరు వికెట్లు కోల్పోయి టార్గెట్‌ను ఛేదించి విజయం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు సాధించిన బౌలర్ నిరంజన్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. కార్యక్రమంలో లీగ్ మ్యాచ్ నాగర్‌కర్నూల్ ఇన్‌చార్జి సతీశ్, కోచ్ అభిజిత్, వనపర్తి జట్టు ఇన్‌చార్జి జయశంకర్, మహబూబ్‌నగర్ క్రికెట్ అసోసియేషన్ ఇన్‌చార్జి మొహమ్మద్ మన్నన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి

» ఏవో మురళీధర్



భూత్పూర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్ మొదలు కాబోతుంది. రైతులు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని, గ్రామాల్లో తిరిగి లూజు విత్తనాలు అమ్మే వారి వద్ద ఎట్టి పరిస్థితిల్లో కొనరాదని ఏవో మురళీధర్ రైతులకు సూచించారు.

రైతులు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి?

రైతులు వేసవిలో లోతు దుక్కులు దున్నుకోవాలి. పచ్చి రొట్ట ఎరువుల తయారికి జీనుగ విత్తనాలు చల్లుకోవాలి. లైసెన్సు డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి.

రైతులకు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉన్నాయా?

రైతులకు సరిపడా డీఏపీ 455 టన్నులు, యూరియా 1400 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 877 టన్నులు, పోటాష్ 45 టన్నులు, విత్తనాలు అన్ని సిద్ధంగా ఉన్నాయి.

విత్తనాలు నాటేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి?

విత్తనాలు నాటే ముందు విత్తన శుద్ధి తప్పని సరిగా చేయాలి. విత్తన శుద్ధితో తెగుళ్ల తగ్గి దిగుబడి బాగా వస్తుంది.

ఈ సారి ఏఏ పంటలు సాగయ్యే అవకాశం ఉంది?

వరి 16,550 ఎకరాలు, పత్తి 5800 ఎకరాలు, మొక్క జొన్న 1800 ఎకరాలు, జొన్న 1500 ఎకరాలు, ఆముదాలు 340 ఎకరాలు, రాగులు 102 ఎకరాలు, కందులు 393 ఎకరాలు, పెసర్లు 23 ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉంది.

న్యూస్ బాక్స్

ఇద్దరు ఎస్ఐల బదిలీ

మహబూబ్‌నగర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు ఎస్ఐలకు బదిలీ జరిగింది. ఈ మేరకు మంగళవారం డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు. కోయిలకొండ ఎస్ఐగా పనిచేస్తున్న భాస్కర్‌రెడ్డిని వీఆర్ వనపర్తి జిల్లాకు బదిలీ చేయగా, వనపర్తిలో వీఆర్‌లో ఉన్న తిరుపాజిని కోయిలకొండ ఎస్ఐగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

టెక్స్‌టైల్స్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని యువతకు హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ టెక్నాలజీ డిప్లమా కోర్సుల్లో మూడేళ్ల పాటు కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇన్స్టిట్యూట్ నందు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు డి.బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందు కోసం ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని విషయాలకు చేనేత మరియు జౌళిశాఖ సహాయ సంచాలకులు జిల్లా కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

మిడ్జిల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాణిపేట, వెలుగొమ్ముల, అయ్యవారిపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ యూపీ రాజు పరిశీలించారు. ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని, వర్షాలు పడితే తాము నష్టపోయే ప్రమాదముందని రైతులు తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన తహసీల్దార్ జిల్లా అధికారులతో మాట్లాడి కొనుగోళ్లను వేగవంతం చేస్తామన్నారు. పీఏసీఎస్ సీఈవో బాల్‌రెడ్డి ఉన్నారు.

క్షయ నిర్ధారణ పరీక్షలు

మిడ్జిల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం 80 మందికి క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. తెమడ, క్షయ వ్యాధితో బాధపడుతున్న వారికి పోషక పదార్థాలు అందజేశారు. క్షయవ్యాధి నిర్ధారణ అయిన వారు మందులు వాడాలన్నారు. సీహెచ్‌వో అయూబ్‌ఖాన్, సూపర్‌వైజర్ ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ సంపత్‌కుమార్, దేవయ్య, జంగయ్య, పారిజాత పాల్గొన్నారు.

వైద్యం కోసం రెడ్డిసేవా సమితి సహకారం

పాలమూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : మూసాపేట మండలం నందిపేట గ్రామానికి చెందిన నందకిషోర్‌రెడ్డి హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో గాయపడి కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యం కోసం సుమారు రూ.15 లక్షలు ఖర్చు అవుతుందని పాలమూరు రెడ్డి సేవా సమితిని కుటుంబ సభ్యులు సంప్రదించారు. రెడ్డి సేవా సమితి దాతల నుంచి, సొంత నిధుల నుంచి రూ.1.50 లక్షలను మేనమామ వెంకటేశ్వరరెడ్డికి అందజేశారు.

బదిలీపై వెళ్తున్న డీఎస్పీకి సన్మానం

మహబూబ్‌నగర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : డీసీఆర్‌బీ విభాగంలో వర్టికల్ డీఎస్పీగా పనిచేస్తున్న సుదర్శన్ బదిలీపై వెళ్లడంతో మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జానకి సత్కరించారు. బదిలీలో భాగంగా హైదరాబాద్ గోషామహల్ ఏసీపీగా బదిలీ అయ్యారు. అడిషనల్ ఎస్పీ రాములు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, ఆర్ఐ కృష్ణయ్య పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో ప్రతీ తండాకు బీటీరోడ్డు

» ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

» రూ.2.10 కోట్లతో బీటీ రోడ్డుకు శంకుస్థాపన



ఆదర్శనగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని ప్రతీ తండాకు బీటీరోడ్డు సౌకర్యం కల్పిస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తండాల్లో మౌలిక వసతుల కల్పనకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. మంగళవారం రూ.2.10 కోట్లతో లాల్యానాయక్ తండాకు బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ముడా ఛైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, తులసీరాంనాయక్, రాజు గౌడ్, ప్రతాప్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనగర్‌లో సమస్యలపై ఆరా

పాలమూరు నగరంలోని ఆదర్శనగర్‌లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పర్యటించి, ఆదర్శనగర్‌తో పాటు వికలాంగుల కాలనీలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పదేళ్లగా ఇక్కడ ఎలాంటి అభివృద్ధి జరగలేదని, కాలనీలలో తాగునీటి సమస్య ఉందని, వెంటనే సమస్యలన్నింటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లలు చదువుకోవడానికి పాఠశాల ఏర్పాటు కోసం స్థల పరిశీలన చేయాలని, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు ముడా నిధులతో గడియారం చౌరస్తా, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అదే విధంగా కార్పొరేషన్ నిధుల నుంచి వీధి వ్యాపారుల కోసం నిర్మించిన షెడ్, షాపులను ఆయన ప్రారంభించి రోడ్డుపై వ్యాపారం చేసే వీధి వ్యాపారులకు అందజేశారు. ఆనంద్ కుమార్‌గౌడ్, సిరాజ్‌ఖాద్రీ, ఫయాజ్, గుండా మనోహర్, శ్రీనివాస్‌యాదవ్, సల్మాన్, రఘు, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోచమ్మ తల్లీ చల్లంగా చూడు

మహబూబ్‌నగర్ న్యూటౌన్ : పోచమ్మ తల్లీ అందరిని చల్లంగా చూడాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం నగరపాలక సంస్థ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నూతనంగా నిర్మించిన పోచమ్మ తల్లి ఆలయం ప్రారంభోత్సవం, విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోచమ్మ తల్లి ఎంతో మహిమ గల దేవత అని, ఆమె దీవెనలు ఈ పట్టణంపై ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు హన్మంతు, శివశంకర్, నాయకులు చంద్రశేఖర్, కావలి కాశిం, యాదయ్య, నాగేందర్, తిరుపతయ్య, నరేందర్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రచ్చకెక్కిన పాలకొండ భూదందా

» ఒకే భూమి రెండు పార్టీలకు అగ్రిమెంట్

» నకిలీ డాక్యుమెంట్‌లని ఒకరు.. బెదిరించి చేసుకున్నారని మరొకరు

» పోలీసులను ఆశ్రయించిన ఇరు వర్గాలు.. వేర్వేరుగా ప్రెస్‌మీట్‌లు



పాలకొండ శివారులోని 272 సర్వే నెంబర్ భూమి

మహబూబ్‌నగర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో భూదందా కొత్తపుంతలు తొక్కుతోంది. భూముల విలువ పెరగడం. రెవెన్యూ చట్టాల్లో ఉన్న లొసుగులను అడ్డం పెట్టుకుని ఒకే భూమిని ఇద్దరు, ముగ్గురికి అగ్రిమెంట్‌లు చేయడం. రిజిస్ట్రేషన్‌లు చేయడం పరిపాటిగా మారుతోంది. ఇది కోర్టులు, పోలీస్‌స్టేషన్‌ల వరకు వెళ్లడం అటు భూమి విక్రయించిన వాళ్లు, కొనుగోళ్లు చేసిన వాళ్లు కోర్టులు, పోలీస్‌స్టేషన్‌ల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఈ భూదందాలో భాగస్వాములైన పార్టీలు పోటాపోటీగా మీడియా ముందుకొచ్చి ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకోవడంతో భూదందా బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. పాలకొండ శివారులోని సర్వేనెంబర్ 272 లో 7.30 ఎకరాలు, 3 ఎకరాలు మొత్తం 10.30 ఎకరాల భూమి పాలాది చంద్రమౌళేశ్వర్, కొడుకులు పాలాది శ్రీనివాస్, పాలాది రాంబాబుపై ఉంది. ఈ భూమి ఇప్పుడు రెండు పార్టీలు తమది అంటే తమది అంటూ గొడవపడటమే కాకుండా ఒకరిపై ఒకరు కోర్టులు, పోలీస్ స్టేషన్‌లకు వెళ్లడం కేసులు నమోదు కావడం జరిగింది. తాజాగా వివాదం ముదిరి మీడియా ముందుకొచ్చి ప్రెస్‌మీట్‌లు పెడుతుండటంతో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతుంది. కాగా ఇదే విషయమై సోమవారం కళావతమ్మ, రాంబాబుతో పాటు మాలె శ్రీనివాస్ గౌడ్ అనే మరో వ్యక్తి సోమవారం హైదరాబాద్ లో డీజీపీని కలిసి రాఘవేందర్‌రాజు తమను బెదిరించి భూమి లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు.

51 ప్లాట్లు ఇస్తామని రిజిస్ట్రేషన్ చేశాం..

కళావతమ్మ, రాంబాబు

పాలకొండ శివారులోని సర్వేనెంబర్ 272లో 7.30 ఎకరాల్లోని 51 ప్లాట్లు మాత్రమే తాము శివలింగం, సురేశ్‌లకు రూ.50 లక్షలకు అగ్రిమెంట్ చేసి మాట ప్రకారం రిజిస్ట్రేషన్ చేశామని కళావతమ్మ, రాంబాబు చెబుతున్నారు. అయితే శివలింగం, సురేశ్‌తోపాటు రాఘవేందర్‌రాజు వచ్చి అగ్రిమెంట్‌లో మిగతా మూడు ఎకరాల భూమి కూడా రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పారని అది కూడా రిజిస్ట్రేషన్ చేయాలని బెదిరిస్తున్నారన్నారు. మూడెకరాలకు సంబంధించి తాము రిజిస్ట్రేషన్ చేయమని చెప్పినా అగ్రిమెంట్‌లో అలానే రాశారని ఇప్పుడు పోలీసులను అడ్డం పెట్టుకుని బెదిరిస్తున్నారని మీడియా ముందు వాపోయారు. 51 ప్లాట్లకు రూ.50 లక్షలు ఇస్తామని చెప్పి రూ.30 లక్షలు మాత్రమే ఇచ్చారని మిగతా డబ్బులు చెల్లించలేదన్నారు.

నకిలీ అగ్రిమెంట్‌లతో మోసం చేస్తున్నారు : రాఘవేందర్‌రాజు

పాలాది రాంబాబు తమకు 7.30 ఎకరాల్లో 51 ప్లాట్లు, 3 ఎకరాల భూమి కూడా అగ్రిమెంట్ చేశారని, ముందుగా అనుకున్న ప్రకారం 51 ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేశారని, ఇందుకు రూ.50 లక్షలు చెల్లించడం జరిగిందని రాఘవేందర్‌రాజు స్పష్టం చేశారు. ఇక మిగిలిన 3 ఎకరాల భూమి మాత్రం రిజిస్ట్రేషన్ చేయకుండా ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. తమకు అగ్రిమెంట్ చేసిన 3 ఎకరాల భూమిని ఈ భూమితో సంబంధంలేని గోపాల్, మాలె శ్రీనివాస్‌గౌడ్ నకిలీ డాక్యుమెంట్ సృష్టించి 3 ఎకరాల భూమిని తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకుని అందరినీ తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. దీనిపై తాము గతంలోనే సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా రూరల్ పరిధిలోకి వస్తుందని చెప్పగా, అక్కడ కూడా ఫిర్యాదు చేశామన్నారు. హైకోర్టులోనూ రిట్‌పిటీషన్ వేయడం జరిగిందన్నారు.

వెంటనే ధాన్యం తరలించాలి



తహసీల్దార్ రాజుతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మిడ్జిల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇసుక తరలింపునకు లారీలు పుష్కలంగా ఉన్నా.. ధాన్యం తరలింపునకు ప్రభుత్వానికి లారీలు కరువైయ్యాయని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి అన్నారు. మంగళవారం మండలంలోని రాణిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి, మాట్లాడారు. ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే ధాన్యం అక్కడక్కడ తడిసి ముద్దాయిందని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చిన తహసీల్దార్ యాపీ రాజుకు రైతుల సమస్యలను వివరించగా, వెంటనే ధాన్యం కొనుగోలు వేగవంతం చేసేందుకు చర్యలు చేపడుతామన్నారు. పీఏసీఎస్ డైరెక్టర్ భీమయ్య, నాయకులు వెంకటయ్య, బుచ్చయ్య, వాసుదేవ్, అంజనేయులు, ప్రేమ్‌కుమార్, నవీన్, అరుణ్‌కుమార్ ఉన్నారు.

అందరూ ఇంటర్‌లో చేరేలా చూడాలి : కలెక్టర్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి పాసైన వానంతా ఇంటర్మీడియట్‌లో చేరేలా చూడాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పదో తరగతి పరీక్షలు రాసి పాసైన వారంతా ఇంటర్మీడియట్‌లో చేరేలా చూడాలని, ఇందు కోసం పదో తరగతి పూర్తైన విద్యార్థులను ఫోన్ ద్వారా సంప్రదించి వారు ఏ కళాశాలలో చేరాలనుకుంటున్నారో వివరాలను తెలుసుకోవాలన్నారు. వ్యక్తిగతంగా విద్యార్థుల తల్లితండ్రుల ఫోన్ నెంబర్లను ఆయా పాఠశాలల వారీగా సేకరించాలన్నారు. 10లో ఫేయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి వారు పాసయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటర్‌లో పాస్ శాతం తక్కువ కావడానికి కారణాలు ఆయా కళాశాల ప్రిన్సిపాల్స్‌ను అడిగి తెలుసుకున్నారు. బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలన్నారు. చెవిటి, మూగ, అంధ లాంటి ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను గుర్తించి భవితా కేంద్రాల్లో చేర్పించాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, డీఈవో ప్రవీణ్‌కుమార్, డీఐఈవో కౌసర్ జహన్, అడల్ట్ ఎడ్యుకేషన్ డీడీ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్డీవో నర్సింహులు, డీడబ్ల్యూవో జరీనాబేగం, సీఎంవో బాలుయాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచాలి

» ఐదు రోజుల శిక్షణకు టీచర్లు విధిగా హాజరుకావాలి » డీఈవో ప్రవీణ్‌కుమార్



ఉపాధ్యాయుల శిక్షణలో మాట్లాడుతున్న డీఈవో ప్రవీణ్‌కుమార్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మే 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పెంచాలి డీఈవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం రెండో విడత ఉపాధ్యాయుల శిక్షణలో భాగంగా ఐదు రోజుల శిక్షణను జేపీఎన్‌ఈఎస్‌లో ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఈ శిక్షణ కార్యక్రమాల ద్వారా మంచి నైపుణ్యాలు పెంచుకొని విద్యార్థుల్లో లోతైన అభ్యసన సామర్థ్యాన్ని పెంచాలన్నారు. ఆధునిక బోధనా సాంకేతికతతో పాటు విద్యా మానసిక విజ్ఞానం మూల్యాంకన పద్ధతులు, డిజిటల్ పాఠ్య విధానాలపై ప్రతీ ఉపాధ్యాయుడు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ప్రతీ ఉపాధ్యాయుడు విధిగా శిక్షణకు హాజరుకావాలన్నారు. అంతకుముందు శిక్షణ కేంద్రాన్ని రాష్ట్ర పరిశీలకురాలు అనురాధ, నూట్యాన్ ఉర్దూ మీడియం స్కూల్‌లో జరుగుతున్న ఉర్దూ శిక్షణ కేంద్రాన్ని ఎసీఆర్టీ పరిశీలకులు విజయభాస్కర్ పరిశీలించారు. కాగా ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం సరిగ్గా లేకపోవడం, గదుల్లో చీకటి, ఉక్కపోతతో ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయంపై ఏఎంవో దుంకుడు శ్రీనివాస్‌ను 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో సంప్రదించగా కొంత వరకు ఇబ్బంది ఉన్న మాట వాస్తమేనని, దాన్ని సరిచేస్తున్నామని తెలిపారు. ఏఎంవో దుంకుడు శ్రీనివాస్, సీఎంవో బైకాని బాలుయాదవ్, డీఆర్పీలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మధన్ మోహన్‌యాదవ్, శ్యాంబాబు, రవికుమార్, వెంకటేశ్వర్లు, తహేర్, గోవింద్‌నాయక్, రూప్ అధ్యక్షుడు జగదీష్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, శ్రీరాములు పాల్గొన్నారు.

● భూత్పూర్ : ప్రతీ ఉపాధ్యాయుడు విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని బలమైన పునాదులు వేయాలని ఎంఈవో ఉషారాణి అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ హైస్కూల్లో మండలంలోని వివిధ పాఠశాలలకు సంబంధించిన ఉపాధ్యాయులతో కలిసి శిక్షణా తరగతులను ఎంఈవో ప్రారంభించి, మాట్లాడారు. ఐదు రోజుల పాటు జరిగే శిక్షణా తరగతులను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో కోరారు.

● రాజాపూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎంఈవో సుధాకర్ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 77 మంది ఉపాధ్యాయులకు శిక్షణ హాజరయ్యారు.

● జడ్చర్ల : జడ్చర్ల మునిసిపాలిటీలోని జడ్చర్ల జడ్పీహెచ్ఎస్‌లో జడ్చర్ల మండలంలోని ఉపాధ్యాయులకు, బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్‌లో మిడ్జిల్ మండలంలోని ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు ఎంఈవో మంజులాదేవి వెల్లడించారు. జడ్చర్ల జడ్పీహెచ్ఎస్‌లో శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించి, మాట్లాడారు. జడ్చర్ల మండలం నుంచి 161 మంది, మిడ్జిల్ మండలం నుంచి 77 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



తెలంగాణ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు

పాలమూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్‌కోడ్‌లుగా తీసుకొచ్చిందని, వాటిని తక్షణమే రద్దు చేయాలని మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో సీఐటీయూ, టీయూసీఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్, వెంకటేష్ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మొండిగా కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు కోడ్‌లను తీసుకువచ్చిందని నిప్పులు చెరిగారు. దీంతో కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి వ్యతిరేకంగా జులై 9న చేపట్టిన దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలన్నారు. ఖమర్‌అలీ, వరద గాలెన్న, లక్ష్మయ్య, పడాల వెంకటయ్య, చిన్నకేశప్ప, వెంకట్రాములు, గణేష్, సతీష్, దాసు పాల్గొన్నారు.

● జడ్చర్ల : కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో జడ్చర్ల మునిసిపల్ కార్మికులు నిరసన తెలిపారు. జడ్చర్ల పట్టణంలోని క్రాస్‌రోడ్డు, సిగ్నల్‌గడ్డ అంబేడ్కర్ చౌరస్తాల వద్ద నిరసన కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి, జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య, మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, కార్మికులు మహేష్, సాగర్, చంద్రమౌళి, అంజమ్మ, నర్సిములు, కేశవులు, యాదయ్య, అలివేలు, శివలీల, స్వరూప, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

గతేడాది కంటే 6.5 రెట్లు అధిక ధాన్యం కొనుగోళ్లు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి) : గత యాసంగి సీజన్ కంటే ఈ యాసంగిలో 6.5 రెట్లు రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు కలెక్టర్ విజయేందిర బోయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. మార్కెటింగ్ సీజన్ మే 20 నాటికి గత యాసంగి 2023-24లో 110 కొనుగోలు కేంద్రాల ద్వారా 19,052 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, ప్రస్తుత సంవత్సరం 2025లో 192 కొనుగోలు కేంద్రాల ద్వారా 23,410 మంది రైతుల నుంచి 1,24,890 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి 17,587 మంది రైతులకు రూ.212 కోట్ల 60 లక్షలు చెల్లింపులు పూర్తి చేశామని తెలిపారు. మిగిలిన రైతులకు రెండు రోజుల్లో చెల్లింపులు చేయనున్నట్లు తెలిపారు. ఈ మే 20 నాటికి గతం కంటే 6.5 రెట్లు అధికంగా ధాన్యం కొనుగోలు చేయడమే కాకుండా రైతులకు డబ్బులు సకాలంలో చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన 1,24,890 మెట్రిక్ టన్నుల ధాన్యంలో సన్న రకం ధాన్యం 85,760 మెట్రిక్ టన్నులు ఉందని, రూ.500 బోనస్ ప్రకారం రూ.42.88 కోట్లు త్వరలో చెల్లించ నున్నట్లు తెలిపారు. వర్షాల వల్ల ధాన్యం పాడవకుండా మార్కెటింగ్ శాఖ ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఇంకో 15 రోజుల్లో ధాన్యం పూర్తి స్థాయిలో కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు.

మైనర్లు వాహనాలు నడిపిస్తే చట్టప్రకారం చర్యలు



పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ చంద్రశేఖర్

భూత్పూర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు నిబంధనలకు విరుద్ధంగా మైనర్లు వాహనాలు నడిపిస్తే వారి తల్లిదండ్రులపై చట్టప్రకారం చర్యలు నిర్వహించి వాహనాలను సీజ్ చేస్తామని ఎస్ఐ చంద్రశేఖర్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని తాటిపర్తిలో మైనర్ బాలురు వాహనాలను నడిపిస్తుండగా ఎస్ఐ సమక్షంలో పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, వారు ఇష్టానుసారంగా అతివేగంగా నడిపిస్తే వారితో పాటు ఇతరులు ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉన్నాయన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

మిడ్జిల్ : ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, నేరాల నియంత్రణకు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ శివనాగేశ్వర్ నాయుడు అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని వస్పుల గ్రామంలోని సురక్ష పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో బాల్యవివాహాలు, రోడ్డు ప్రమాదాలు, ఆన్‌లైన్ మోసాలు, సామాజిక రుగ్మతలు, సాంఘిక దురాచారాలతో పాటు పలు విషయాలతో పాటు పలు విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కళాబృందం సభ్యులు రాములు, హెడ్ కానిస్టేబుల్ జగదీష్, కానిస్టేబుల్ వెంకటేష్ తదితరులున్నారు.

ఆర్టీఐ కమిషనర్ల ఎంపికలో బీసీలకు అన్యాయం

పాలమూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీఐ కమిషనర్ల నియామకంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేసిందని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌సాగర్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం తాజాగా నియమించిన రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్, కమిషనర్ల నియామకంలో నియమ నిబంధనలు పాటించలేదన్నారు. ఆర్టీఐ కమిషనర్లుగా మరి కొందరిని నియమించే అవకాశం ఉండటంతో అందులో బీసీలకు అవకాశం కల్పించాలన్నారు.

నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులు



చంద్రమ్మ (ఫైల్)

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), మే 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నిర్మల్ డయాగ్నోస్టిక్ సెంటర్ అధినేత, రెడ్‌క్రాస్ సంస్థ నిర్వహణ కమిటీ సభ్యుడు తిరుపతిరెడ్డి మాతృమూర్తి చంద్రమ్మ మంగళవారం నేత్రదానం చేశారు. అనారోగ్య కారణాల దృష్ట్యా మంగళవారం మృతి చెందడంతో ఆమె కోరిక మేరకు కుటుంబ సభ్యులు రెడ్‌క్రాస్ ఛైర్మన్ లయన్ నటరాజ్‌ను సంప్రదించారు. దీంతో ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రి నుంచి టెక్నీషియన్ రమేష్ అక్కడికి చేరుకొని మృతురాలి కంటి నుంచి కార్నియాను సేకరించారు. అనంతరం నేత్రదానం చేసిన ధ్రువపత్రాలను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆమె మృతిపై రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మన్ డాక్టర్ శ్యామ్యూల్, కోశాధికారి జగపతిరావు, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు రమణయ్య సంతాపం తెలిపారు.

మునిసిపాలిటీలో అక్రమ నిర్మాణాలను తొలగిస్తాం



కౌన్సిలర్లతో సమావేశమైన మునిసిపల్ ఛైర్‌పర్సన్ కోనేటి పుష్పలత

జడ్చర్ల, మే 20 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీలో అక్రమ, అనుమతులు లేని నిర్మాణాలను తొలగిస్తామని జడ్చర్ల మునిపల్ ఛైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడి వెల్లడించారు. జడ్చర్ల మునిసిపల్ కార్యాలయంలో కౌన్సిలర్‌లతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అక్రమ నిర్మాణాలకు తావివ్వకూడదని, వాటిపై కఠినంగా వ్యవహరించాల్సిందేనని చర్చించారు. మునిసిపాలిటీలో ఎక్కడెక్కడ అక్రమ నిర్మాణాలు, అనుమతులు లేని నిర్మాణాలు, అనుమతులు కంటే అదనంగా చేపట్టిన నిర్మాణాలు తదితర పూర్తి వివరాలను సేకరిస్తున్నామని, వాటన్నింటిపై చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. ఈ అంశంపై కౌన్సిలర్‌లతో చర్చించారు. కౌన్సిలర్‌లు ప్రశాంత్‌రెడ్డి, నందకిశోర్‌గౌడ్, చైతన్యచౌహాన్, దేవా, కుమ్మరిరాజు, విజయ్, మహేష్, రహీమ్, శశికిరణ్, కృష్ణారెడ్డి, రాంమోహన్, నర్సిములు పాల్గొన్నారు.

జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల రక్తదానం

మహబూబ్‌నగర్ వైద్యవిభాగం/మహబూబ్‌నగర్‌టౌన్/ పాలమూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా మంగళవారం ఆయన అభిమానులు రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి రెడ్‌క్రాస్ ఛైర్మన్ లయన్ నటరాజ్ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. తమ అభిమాన హీరో పుట్టిన రోజుకు క్షీరాభిషేకాలు, పూలాభిషేకాలు కాకుండా రక్తదానం చేయడం గొప్పవిషయం అన్నారు. అనంతరం 45 మంది అభిమానులు రక్తదానం చేశారు. అంతకుముందు ఆనాథ పిల్లలకు అన్నదానంతో పాటు 4 బియ్యం బస్తాలు, పండ్లు పంపిణీ చేశారు. జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు ఫేరోజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా సలహాదారులు బోయరాజు, జయప్రకాశ్, గౌరవ అధ్యక్షుడు యాదయ్య గౌడ్ పాల్గొన్నారు.